క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా ఉపకరణాల పంపిణీ



దాత అందజేసిన గిలకలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కిర్లంపూడి: మండలంలోని తామరాడ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా ఉపకరణాలను పంపిణీ చేశారు. పాతకాలపు ఆటలను ప్రోత్సహించే ఉద్దేశంతో గ్రామానికి చెందిన దాత గోకాడ సత్యనారాయణమూర్తి సొంత ఖర్చులతో చేయించిన గిలకలను పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు అందజేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం యల్లపు కృష్ణ, గోకాడ రాజా, వరప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: భాద్రపద అమావాస్యను పురస్కరించుకుని బుధవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారన్నారు. భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొనవచ్చునని దేవస్థానం అధికారులు తెలిపారు.

నేటి నుంచి వాలీబాల్, కబడ్డీ పోటీలు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో బుధవారం నుంచి శుక్రవారం వరకూ సీబీఎస్ఈ క్లస్టర్–7 స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మంగళవారం తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన బాల, బాలికలకు అండర్–14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు రెండు రాష్ట్రాలకు చెందిన 1200 మంది క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. వీరికి వసతి, క్రీడలకు అవసరమైన ఏర్పాట్లు చేశామని వివరించారు.

నేడు, రేపు ఉపాధి గ్రామ సభలు

గండేపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను గుర్తించేందుకు మండల పరిధిలోని గ్రామాల్లో బుధ, గురువారాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఏపీఓ గంగాభవాని తెలిపారు. ఈ సభల్లో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే కొత్త పనులను గుర్తిస్తామన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట: మండలంలోని మల్లిశాలలో సారా బట్టీలపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. సారా తయారు చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరు పరిచినట్టు తెలిపారు.

మద్యం దుకాణాలు కేటాయించాలని వినతి

తుని రూరల్: ప్రభుత్వం ప్రకటించిన విధంగా 10 శాతం మద్యం దుకాణాలను కల్లుగీత కార్మిక (శెట్టిబలిజ) సంఘం, సొసైటీలకు కేటాయించాలని శెట్టిబలిజ కార్మికులు కోరారు. ఈ మేరకు మంగళవారం శెట్టిబలిజ సంఘ నియోజకవర్గం అధ్యక్షుడు రంగాల మల్లికార్జునరావు, కార్యదర్శి పిల్లి శ్రీను, గౌరవాధ్యక్షుడు గుర్ర్తి రాంబాబు ఆధ్వర్యంలో సంఘం, సొసైటీ ప్రతినిధులు తేటగుంట క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడిని కలసి వినతి పత్రం అందజేశారు. ఎక్సైజ్ పాలసీ అమలుకు కృషి చేస్తామని యనమల హామీ ఇచ్చారు. తొలుత ముందు నూతన ఎక్సైజ్ పాలసీలో ప్రకటించిన విధంగా పది శాతం దుకాణాలను (మా దుకాణాలు మాకే) కేటాయించాలని నినాదాలు చేశారు. అనసూరి అప్పారావు, వాడబోయిన సాంబయ్య, తుట్టా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో వెబినార్

గండేపల్లి: భవిషత్ తరం ఇంజినీర్లకు సమర్థవంతమైన సాధనాలు, వినూత్న పరిష్కారాలను అందించడమే ఇ–ప్లాన్ ఉద్దేశమని ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించిన వెబినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ–ప్లాన్‌ను ఉపయోగించి ఎలక్ట్రికల్ డిజైన్‌ను సాధికారపరచడంపై ఆన్‌లైన్ వెబినార్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ప్రాజెక్ట్ జీవితచక్రం, ప్రణాళిక, రూపకల్పన నుంచి డాక్యుమెంటేషన్, నిర్వహణ వరకూ విద్యుత్, ఆటోమేషన్ ఇంజినీరింగ్ పరిశ్రమల్లో సహకారాన్ని మెరుగుపరుస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఛాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి, డీన్ డోలా సంజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ.. దిగుబడికి రక్షణ

- గ్రామాల్లో జోరుగా 'పొలం పిలుస్తోంది'
- పంటల సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



పెదశంకర్లపూడిలో రైతులకు జిల్లేడు కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



టీజే నగరంలో రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్



రాపాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ విజయలక్ష్మి, ఏఓ అశోక్‌కుమార్



పెదమల్లాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి యింటి వీర గంగాధర్ సూచించారు. మండలంలో పెదశంకర్లపూడి, లంపకలోవ గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సాగులో రసాయన ఎరువులకు బదులుగా జీవామృతం, బీజామృతం వినియోగించడం, పురుగు మందులకు బదులుగా కషాయాలు వాడడం వల్ల భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. రైతులకు జిల్లేడు కషాయం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒమ్మంగి పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ సతీష్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: వరిలో వ్యాప్తి చెందే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని టీజే నగరం, బొద్దవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ విధానం, వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వరి పొలాల పరిశీలించి దోమ, కాండం కుళ్లు, ఆకుముడత తెగుళ్ల వ్యాప్తి చెందుతున్నట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యానసాగుతో రైతులకు లాభాలు

తుని రూరల్: వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పండ్ల తోటలను సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయని ఉద్యాన అధికారి జి.వి జయలక్ష్మి అన్నారు. మండలంలోని రాపాక, కేఓ మల్లవరం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఓ విజయలక్ష్మి మాట్లాడుతూ డిమాండ్‌కు అనువుగా ఉత్పత్తి పెంచాలన్నారు. అందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పండ్ల తోటల పునరుద్ధరణ, పండ్లతోటల పెంపకం, ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణం పెంపు, అంతర పంటలు, కూరగాయలు, పూల తోటల సాగు, యాంత్రీకరణ, షేడ్‌నెట్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. ఖరీఫ్‌లో సామూహిక ఎలుకల నిర్మూలన, ఎరువులు, పురుగుల మందుల వాడకం, మందుల పిచికారీపై ఏఓ బి.అశోక్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ పి.జగ్గఅప్పారావు, వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం

ఏలేశ్వరం: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి అన్నారు. మండలంలోని సి.రాయవరంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేటలో ఏఓ సద్గురుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం అధికారి హరి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు వరిలో ఆకు ఎండు తెగులు నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ సురేఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కరరావు, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

ప్రత్తిపాడు రూరల్: రైతులు సాగులో మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్ సూచించారు. మండలంలోని ఒమ్మంగి, పెదశంకర్లపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఒమ్మంగి పశువైద్యాధికారి సతీష్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

శంఖవరం: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని వేళంగి, పెదమల్లాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరి, అరటి పంటలను పరిశీలించి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా రైతులకు వంద శాతం రాయితీపై ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, పి.నాగేశ్వరరావు, రమేష్, వ్యవసాయ సహాయకులు మణికంఠ, తాతబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



లంపకలోవ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన దళితులు మంగళవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గ్రామంలోని సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువకు వరద వస్తే తమ కాలనీ నీట మునుగుతోందని, రక్షణ గోడ నిర్మించాలని కోరారు. పి.జగన్నాథపురం–లంపకలోవ గ్రామాల మధ్య తరాల నుంచి సాగు చేసుకుంటున్న కొండ పోరంబోకు భూమికి పట్టాలివ్వాలని, గ్రామంలో మంచినీరు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీలా మహిళా సంఘం జిల్లా ప్రతినిధి రాజాల రత్నం, బీరా దేవతయ్య, బోరపాటి ఏసుబాబు, జల్లు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఈనాం భూములపై హక్కులు కల్పించాలి

ప్రత్తిపాడు రూరల్: పేదలకు ఈనాం భూములపై హక్కులు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని చింతలూరు, పోతులూరు, ధర్మవరం గ్రామాల్లోని పంచాయితీ కార్యాలయాల వద్ద సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలూరులోని ఈనాం భూములపై పేదలకు హక్కులు కల్పించాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నేతలు తాడి నాగేశ్వరరావు, కుంచే బండితల్లి, దుమ్ముల సింహాచలం, మాస రాజామణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



తునిలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సత్యనారాయణరాజు

తుని: స్థానిక గవరపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు వేడుకలు నిర్వహించారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు డీఎస్ఎన్ మూర్తి, క్లబ్ ప్రతినిధులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ హెల్త్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు విద్యార్థులకు నోట్‌బుక్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీ కృషిని కొనియాడారు. విద్యార్థులు అహింసా మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ చదరం శివాజీ, జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, వాడపల్లి శ్రీనివాస్, పర్వత బాబూరావు, వెంకటరమణ, సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కృష్ణవరం టోల్ గేట్ వద్ద మొక్కలు నాటిన హైవే సిబ్బంది

గండేపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సూరంపాలెంలో పంచాయతీ, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో మానవాళికి మేలు

కిర్లంపూడి: పరిసరాల పరిశుభ్రతతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని ప్రత్తిపాడు ఎన్‌హెచ్ మెయింటినెన్స్ యార్డు మేనేజర్ నాగేశ్వరరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మధుబాబు, శ్రీనివాస్, టీబీఆర్, ఎస్‌కేసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

రేంజర్ కరుణాకర్‌కు ఘనంగా వీడ్కోలు



రేంజర్ కరుణాకర్ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న సబ్ డీఎఫ్ఓ శ్రీరామారావు, సిబ్బంది

గోకవరం: మండలంలోని సూదికొండలో ఫోక్స్‌పేట రేంజ్ అధికారి ఎం.కరుణాకర్ చింతూరు రేంజ్ కూనవరానికి బదిలీ కావడంతో మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డతీగల సబ్ డీఎఫ్ఓ బి.శ్రీరామారావు మాట్లాడుతూ సిబ్బంది భాగస్వామ్యంతో అటవీశాఖ అభివృద్ధి చెందుతుందన్నారు. ఫోక్స్‌పేట రేంజర్‌గా బాధ్యతలు నిర్వహించిన కరుణాకర్ సమర్థవంతమైన పనితీరు ప్రదర్శించారన్నారు. ఆయన సేవలు సిబ్బందికి ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం రేంజర్ కరుణాకర్ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ సుజిత, ఎఫ్ఎస్ఓ అప్పారావు, నూకరాజు, వరలక్ష్మీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఫోక్స్‌పేట నూతన రేంజర్‌గా పి.శ్రీనివాస్ రానున్నారు.

భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు వృద్ధులే

ప్రత్తిపాడు: భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులు వృద్ధులే అని ప్రత్తిపాడు కోర్టు ప్యానెల్ అడ్వకేట్ బుగత శివ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్తిపాడులోని శ్రీశారద వయోవృద్ధ నిలయంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో సంతానం వృద్ధుల బాగోగులు పట్టించుకోకపోతే మనోవర్తి నిమిత్తం కోర్టును గాని, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌ను గాని ఆశ్రయించవచ్చన్నారు. వృద్ధులకు చట్టప్రకారం లభించే హక్కులు, సీనియర్ సిటిజన్ చట్టం, వృద్ధుల సమస్యలు– పరిష్కారాలు తదితర అంశాలపై ప్యానెల్ అడ్వకేట్ బి.మధుబాబు అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లోవలో దసరా ఉత్సవాలు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జ్ కమిషనర్, ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేస్తామన్నారు. ఉత్సవాలను శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రారంభిస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణ, 4న గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న లలితాదేవి, 7న మహాచండీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దినీదేవి, 12న రాజరాజేశ్వరీదేవి అలంకరణలో తలుపులమ్మతల్లి దర్శనం ఇస్తారని చెప్పారు.

జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు

జగ్గంపేట: గ్రామాల్లో ఎవరైనా జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు మంగళవారం దొంగతనాలు, చీటింగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆటో ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై నిర్వహించిన శిక్షణ మంగళవారంతో ముగిసినట్టు ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఏపీ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి ఎల్.లోవరాజు అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డీన్ వైకేఎస్ సుబ్బారావు, ఎన్.కిషోర్, జి.సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు ఊరెళితే పోలీసులకు సమాచారం ఇవ్వండి

ప్రత్తిపాడు: దసరా సెలవులకు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్నారా..? అయితే మీ సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు కోరారు. సమాచారం ఇస్తే దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దసరా సెలవులకు సొంతూళ్లకు వెళ్లే వారు ఇళ్లల్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు ఉంచరాదన్నారు. లాకర్లలో గానీ, లాకర్లు లేని వారు వాటిని తమకు బాగా తెలిసిన వారి ఇళ్లల్లో లేదా బంధువుల ఇళ్లల్లో భద్రపరచుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

పందుల సంచారంతో ఇక్కట్లు



ఏలేశ్వరం పెద్దవీధిలో సంచరిస్తున్న పందులు

ఏలేశ్వరం: పట్టణంలో వరాహాలు వీర విహారం చేస్తున్నాయి. రహదారులు, వీధుల్లో విచ్చలవిడిగా పందుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో పందుల సంచారంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని పెద్దవీధి, తోటవీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో పందులు ఎక్కువగా సంచరించడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం.. చదువుకు ఉత్సాహం

- పాఠశాలల్లో చెకుముకి సైన్స్ పోటీలు
- సత్తాచాటిన విద్యార్థులు
- విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతుల ప్రదానం



ప్రత్తిపాడులో చెకుముకి పరీక్షల విజేతలతో ఎంఈఓ రాజబాబు



గెద్దనాపల్లిలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఉపాధ్యాయులు



కోటనందూరులో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎస్ కన్నబాబు మాట్లాడుతూ చెకుముకి పోటీలకు మండలంలోని రెండు ప్రాథమికోన్నత, 11 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. నాలుగు పాఠశాలలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 27న కాకినాడలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులుకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం వెంకటపతి రాజు, ఎస్.వీరబాబు, మూర్తి పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో మంగళవారం మండలస్థాయి చెకుముకి పోటీలు (సైన్స్ సంబరాలు) నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని 14 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 70 విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి సీనియర్స్ విభాగంలో కోటనందూరు హైస్కూలు ప్రథమస్థానం, పాత కొట్టాం హైస్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. జూనియర్స్ విభాగంలో అల్లిపూడి కేజీబీవీ మొదటి స్థానం, అల్లిపూడి హైస్కూల్ ద్వితీయస్థానం పొందాయి. విజేతలకు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ కేఎస్‌వీఎస్ నారాయణ, కో కన్వీనర్ కె.వీరబాబు, కోటనందూరు హైస్కూలు హెచ్ఎం ఎస్ వేణుగోపాల్ బహుమతులు అందజేశారు. విజేతలు ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని జేవీవీ కన్వీనర్ నారాయణ తెలిపారు.

ప్రత్తిపాడులో చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రత్తిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ మదినే వెంకటరమణ తెలిపారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీవీ రమణ, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రాపర్తి రామలింగేశ్వరరావు, డి. రాజబాబు, చుక్కల వీరగణేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

ప్రభుత్వ పాఠశాలల సీనియర్ విభాగంలో లంపకలోవ, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలను గెలుచుకున్నారు. జూనియర్ విభాగంలో ధర్మవరం, లంపకలోవ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు.

ఎ.కొత్తపల్లిలో చెకుముకి టాలెంట్ టెస్ట్

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1925 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో సీనియర్స్, జూనియర్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులను జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు జనవిజ్ఞాన వేదిక మండలాధ్యక్షుడు కె.ప్రకాష్ రావు, పాఠశాల హెచ్ఎం ఎ.లక్ష్మిమాణిక్యం తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.చిటిబాబు, ప్రధాన కార్యదర్శి కె.సత్యారావు పాల్గొన్నారు.